## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీ నేతకు పితృ వియోగం



నాగూర్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

నాగలాపురం: మండలంలోని కాలంజేరి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కరప శ్రీనివాసులు తండ్రి నాగూర్‌రెడ్డి (72) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. సమాచారం అందుకున్న సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి నాగలాపురం మండలం కాలంజేరి గ్రామానికి చేరుకుని నాగూర్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మండల కన్వీనర్ అపరంజిరాజు, మేజర్ పంచాయతీ సర్పంచ్ చిన్నదొరై సుధా, నాయకులు ఉదయ్ కుమార్‌రెడ్డి, ఉదయ్, మోహన్ మొదలియార్, దేశప్పన్, అలగేశన్, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### జీతాల కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న టీచర్లు

తొట్టంబేడు: బదిలీ అయిన టీచర్లకు వెంటనే జీతాలు చెల్లించాలని ఎస్టీయూ నేతలు డిమాండ్ చేశారు. తొట్టంబేడు మండలంలో గురువారం ఎస్టీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథం మాట్లాడుతూ ఇటీవల పదోన్నతులు, బదిలీలు అయిన టీచర్లకు వెంటనే జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి దేవేంద్ర పెరిమిడి. శ్రీకాళహస్తి డివిజన్ కన్వీనర్ సుధాకర్‌యాదవ్, జిల్లా కార్యదర్శి మోతీలాల్, తొట్టంబేడు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయప్రకాష్, చంద్రశేఖర్, టీచర్లు పాల్గొన్నారు.

### ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



ప్రత్యేక అలంకారంలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

### చేనేతకు భరోసా కల్పించండి



గాంధీకి నివాళులర్పిస్తున్న చేనేత కార్మికులు

నారాయణవనం: జౌళి రంగంలో చేనేత ఉత్పత్తులకు పూర్వ వైభవం కల్పించడంలో ప్రభుత్వాలు భరోసా కల్పించాలని పలువురు నేత కార్మికులు కోరారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. పాలమంగళం ఉత్తరపుకండ్రిగలో చేనేత కార్మికులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ ఉద్యోగులు వారంలో ఒకరోజు చేనేత వస్త్రాలను విధిగా ధరించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని చేనేత కార్మికులు కోరారు.

### ఫౌండేషన్ స్కూల్‌లో ముగ్గురే విద్యార్థులు



ముగ్గురు విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలోని ఫౌండేషన్ స్కూల్లో ముగ్గురు విద్యార్థులే చదువుకుంటున్నారు. గురువారం ఎంఈఓ మునిసుబ్రమణ్యం పాఠశాలను తనిఖీ చేశారు. ముగ్గురు విద్యార్థులే ఉండడంతో ఆశ్చర్యపోయారు. ఉపాధ్యాయురాలితో కలసి ఆ ముగ్గురు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. పాఠశాలలో ఒకటి, రెండు, మూడు తరగతులకు కలిపి ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉండడం గమనార్హం.

# పట్టు తప్పితే ప్రమాదమే!





ఇరుకైన టూవీలర్ మార్గం



మేర్లపాక సమీపంలోని టోల్‌గేట్

- మేర్లపాక టోల్‌గేట్ వద్ద ఇరుకుగా టూ వీలర్ రోడ్డు
- అదుపుతప్పితే కిందపడడం ఖాయం
- ప్రమాదాల బారిన పడుతున్న ద్విచక్ర వాహనదారులు

ఏర్పేడు: ఏర్పేడు–శ్రీకాళహస్తి మార్గం మేర్లపాక సమీపంలోని టోల్‌గేట్ వద్ద ద్విచక్ర వాహనదారులు పాట్లు అన్నీ, ఇన్నీ కావు. టోల్‌గేట్ నిర్మాణ కాంట్రాక్టర్లు అనాలోచితంగా వ్యవహరించి, ద్విచక్ర వాహనాల రాక, పోకలకు రెండు అడుగులు వెడల్పు కూడా లేకుండా సన్నని దారిని వదిలారు. ఆ మార్గం గుండా వెళ్లాలంటే ద్విచక్ర వాహనదారులు హడలిపోతున్నారు. కాస్త పట్టు తప్పినా, పక్కనున్న పిట్టగోడపై పడి ప్రమాదానికి గురికాక తప్పదని గ్రహించి, చేసేది లేక చాలా మంది లారీల వెనుక ప్రయాణిస్తున్నారు. దీంతో అటు, ఇటు వైపు నుంచి వచ్చే వాహనాలు వీరిని ఢీకొనే ప్రమాదం ఉంది. టూవీలర్ మార్గాన్ని మరింత వెడల్పు చేయాలని పలువురు కోరుతున్నారు.

## నేడు పాలాభిషేకం

నాగలాపురం: మండల కేంద్రంలోని స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న శ్రీ దేవీకరుమారి అమ్మవారికి ఆడి నెల నాలుగో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి పాలాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 9 గంటలకు శ్రీవేదనారాయణ స్వామి ఆలయం నుంచి పాల కలశాలతో బయలుదేరి శ్రీ దేవీకరుమారి అమ్మవారికి ఆలయానికి వెళ్లి.. అక్కడ భక్తుల స్వహస్తాలతో అమ్మవారికి పాలాభిషేకం చేస్తారన్నారు. ఈ పాలాభిషేకంలో పాల్గొనే భక్తులు కలశచెంబు, పాలు, టెంకాయతో పాటు ఆలయ అభివృద్ధికి రూ.101 చెల్లించి రశీదు పొంది పాల్గొనాలని కోరారు. అలాగే ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని, సాయంత్రం శ్రీ దేవీ కరుమారి అమ్మవారి ఊరేగింపు ఉంటుందన్నారు.

## ప్రజా విశ్వాసం కోల్పోయిన కూటమి



పులికుండ్ర గ్రామంలో క్యూఆర్ కోడ్‌లను ఆవిష్కరిస్తున్న నూకతోటి రాజేష్

- సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్

నాగలాపురం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదికే ప్రజా విశ్వాసం కోల్పోయిందని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ విమర్శించారు. ఈ మేరకు పిచ్చాటూరు మండల కన్వీనర్ చలపతిరాజు ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం మండలంలోని అడవి కొడియంబేడు, పులికుండ్రం గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినప్పటికీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, ఎన్నికలకు ముందు అధికారం చేపట్టడం కోసం చంద్రబాబు అనేక హామీలు ఇచ్చి మాయమాటలు చెప్పి మోసం చేశారని ప్రజలకు చంద్రబాబు మోసాలను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్‌నాయుడు, నియోజకవర్గ వలంటీర్ విభాగ అధ్యక్షుడు రమేష్‌రాజు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు సూరిబాబు రెడ్డి, త్యాగరాజ్, చెంగల్ రాజు, మండల యూత్ ప్రెసిడెంట్ అయ్యప్ప, వైస్ ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి, సచివాలయ కన్వీనర్ తొప్పయ్య, నాయకులు ఆర్ముగం రెడ్డి, సెల్వం, చంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిలుక వాహనంపై నీలకంఠేశ్వరుడు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులోని అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి గురువారం చిలుక వాహనంపై పుర వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ముందుగా స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రోచ్చరణల మధ్య స్వామి అమ్మవార్లను చిలుక వాహనంపై కొలువు దీర్చి పుర వీధుల్లో విహరించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

## ప్రపంచ చేనేత దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న చేనేత కార్మికులు

శ్రీకాళహస్తి: మండలంలోని చల్లపాళెంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం చేనేత కార్మికులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు చేనేతలకు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మారాబత్తిని మునిరాజా, చలపతి, సుబ్రహ్మణ్యం, చెంచయ్య, నాగరాజు, చెన్నయ్య, వాసు, రాఘవులు, గుర్రప్ప పాల్గొన్నారు.

## ఉచిత దంత వైద్యశిబిరం



విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రేణిగుంట: పట్టణంలోని వెంకటేశ్వర ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఏఆర్‌కే ప్రజా సంఘం అధ్యక్షుడు అత్తూరు రవికుమార్ ఆధ్వర్యంలో గీతా దంత వైద్యశాల వారు శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ గీత సౌజన్య వారి బృందంతో 200 మంది విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. టూత్‌పేస్ట్‌లు, మందులను ఉచితంగా అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇది రహదారే!

- దుస్థితిలో పాగాలి రోడ్డు



చిన్నపాటి మడుగులను తలపిస్తున్న పాగాలి రోడ్డు

ఏర్పేడు: మండలంలోని పాగాలికి వెళ్లే మార్గం దుర్భరంగా ఉంది. వర్షం పడితే ఈ మార్గంలో ప్రయాణించాలంటే ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడమే. దశాబ్దాలు మారినా ఆ గ్రామానికి వెళ్లే రోడ్డు మాత్రం మరింత దుస్థితికి చేరుకుంది. పంగూరు–శ్రీకాళహస్తి మార్గమధ్యలో పాగాలికి రెండు కిలోమీటర్లు ఇంటర్నల్ మట్టి రోడ్డు ఉంది. రోడ్డంతా గుంతలమయంగా మారి రాకపోకలకు చాలా ఇబ్బందిపడుతున్నారు. అయితే మూడు రోజుల కిందట కురిసిన వర్షానికి ఈ మార్గంలో రోడ్డంతా వర్షపునీటితో పెద్ద, పెద్ద మడుగులను తలపిస్తున్నాయి. పాలకులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

## డిజిటల్ అసిస్టెంట్ లేరు.. స్పందించే వారూలేరు



తెరుచుకోని డిజిటల్ అసిస్టెంట్ రూం

నారాయణవనం: గత మూడు వారాలుగా డిజిటల్ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేయకపోవడంతో మండలంలోని అరణ్యకండ్రిగ పంచాయతీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. సంక్షేమ పథకాలు అందని విద్యార్థులు, రైతులు, తల్లులు సచివాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా సమాధానం చెప్పేవారు కరువయ్యారని వాపోయారు. సాధారణ బదిలీల్లో భాగంగా అరణ్యకండ్రిగ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ దేవేందర్ తిరుపతి రూరల్‌కు బదిలీ అయ్యాడు. అతని స్థానంలో మరొకరిని ప్రభుత్వం నియమించకుండానే అధికారులు రిలీవ్ చేశారు. దీంతో డిజిటల్ అసిస్టెంట్ లేక సచివాలయానికి వచ్చే వారి సమస్యలను, ప్రభుత్వ సర్వీసులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేకపోతున్నారు. ఇటీవల ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలలో నగదు రాని అర్హుల ఫిర్యాదులను డిజిటల్ అసిస్టెంట్ లేక ప్రభుత్వ గ్రీవెన్స్ సర్వర్‌లో సకాలంలో నమోదు చేసుకోలేక పథకాలను పొందలేకపోతున్నారు. దీనిపై ఎంపీడీఓ అరుణ మాట్లాడుతూ అరణ్యకండ్రిగ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ పోస్ట్ ఖాళీగా ఉందన్నారు. సచివాలయంలో మరికరికి అదనపు బాధ్యతలు అప్పగించి, సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## 12న నులి పురుగుల దినోత్సవం



ఎంపీడీఓ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ ప్రసాద్, వైద్యాధికారి ద్వైత

వరదయ్యపాళెం: అందరి సహకారంతో ఈ నెల 12న జరిగే నులి పురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆ మేరకు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో కార్యక్రమం గురించి సమీక్ష నిర్వహించారు. అనంతరం నులి పురుగుల దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆశావర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు సమష్టిగా నులి పురుగుల దినోత్సవం కార్యక్రమం గురించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఒకటి నుంచి 19 సంవత్సరాలు వయసు కలిగిన ప్రతిఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకునే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి ద్వైత, డిప్యూటీ ఎంపీడీఓ మధుసూదన్, ఎంఈఓ సరస్వతి, సీహెచ్‌ఓ కృష్ణంరాజు, పీహెచ్‌ఎన్ శాంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి పాల్గొన్నారు.

## అట్టహాసంగా ద్రౌపదీదేవి ఊరేగింపు



అమ్మవారిని దర్శించుకుంటున్న రాజేష్

నారాయణవనం: మండల కేంద్రమైన నారాయణవనం ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం సాయంత్రం ద్రౌపదీదేవి ప్రత్యేక అలంకరణలో పుష్పపల్లకిపై పురవీధుల్లో విహరించారు. సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, కన్వీనర్ సారకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి వచ్చి ఉత్సవర్లను దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త దేశప్పరెడ్డి దర్శన ఏర్పాట్లు చేసి, ఆలయ మర్యాదలతో తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా వన్నెకుల క్షత్రియ యువకులు కొక్కీలను గుచ్చుకుని వేలాడుతూ మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో చివరిగా ద్రౌపదీదేవిని వివిధ రంగుల పుష్పాలతో అలంకరించగా.. మహిళలు హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు

శ్రీకాళహస్తి: తల్లిపాల వారోత్సవాలను ఎర్రగుడిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ప్రగతి స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త చంద్రశేఖర్, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త లీలమ్మ, సహాయకురాలు రాజేశ్వరి, ఆశా వర్కర్ పాల్గొన్నారు

**లంకమిట్టలో..**

లంకమిట్ట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, స్థానిక సాలిపేట ఏఎన్‌ఎం ధనలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ శాంతకుమారి, సహాయకురాలు రేవతి, ఆశా వర్కర్ వెంకటలక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు .

## క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



చిన్న పాండూరు పీహెచ్‌సీలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న స్విమ్స్ వైద్యులు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన స్విమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం పింక్ బస్ ద్వారా ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు పింక్ బస్‌లో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు నానోగ్రామ్, గర్భాశయ ముఖద్వారా, పాప్‌స్మియర్ పరీక్షలను ఉచితంగా శిబిరంలో నిర్వహించారు. మహిళలు, పురుషులు, పెద్దసంఖ్యలో హాజరై క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజు, నోడల్ ఆఫీసర్లు డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ ఎంలలిత్, చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పవన్‌కుమార్, ప్రశాంత్, స్విమ్స్ వైద్యులు చైతన్యభాను, ఎంపీహెచ్‌ఈఓ రవీంద్ర, సూపర్‌వైజర్ పవన కుమారి పాల్గొన్నారు.

## డాక్టర్ స్వామినాథన్ సేవలు మరువలేనివి

సత్యవేడు: హరిత విప్లవ పితామహుడు, శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సేవలు మరువలేనివని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్ అన్నారు. గురువారం సత్యవేడులోని సీఐటీయూ కార్యాలయంలో స్వామినాథన్ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతదేశంలో ఆహార కొరత ఏర్పడి కరువు కాటకాలతో అల్లాడుతున్న దశలో డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ తన పరిశోధనలు తన మాతృదేశానికి అవసరమని భావించి స్వదేశానికి వచ్చి నూతన వంగడాలు కనుక్కొని ఆహారం పండించడంతో పాటు ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి భారత్‌ను వృద్ధి చేశారని ఈసందర్భంగా తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్రప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆయన తెలిపారు. సమావేశంలో యువజన సంఘం నాయకుడు మురళి పాల్గొన్నారు.

## పారిశ్రామికవేత్తలుగా రాణించండి



ఫ్రెషర్స్ డేలో మాట్లాడుతున్న అశోకరాజు

నారాయణవనం: వృత్తి విద్యాకోర్సులను అభ్యసిస్తున్న యువ ఇంజినీర్లు తమలో నైపుణ్యతను, పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంచుకోవాలని పుత్తూరు గ్రూప్ ఆఫ్ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ అశోకరాజు తెలిపారు. గురువారం కళాశాల ఆడిటోరియంలో మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులు, తల్లిదండ్రులతో ఒకరోజు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్నింటికంటే ఇంజినీరింగ్ కోర్సులు భిన్నంగా ఉంటాయన్నారు. కోర్సులో ప్రతి అంశాన్ని క్రియాశీల, పరిశోధనాత్మక ఆలోచనలతో అభ్యసించాలని సూచించారు. సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌తో నాలుగేళ్ల కోర్సును పట్టుదలతో పూర్తి చేసి పారిశ్రామికవేత్తలుగా, మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రగతిని ప్రతినెలా హెచ్‌ఓడీలతో కలిసి పంచుకోవడంలో తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. భానుప్రకాష్, ప్రిన్సిపాళ్లు జనార్దనరాజు, రమేష్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ముందస్తు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రేణిగుంట: వినాయకచవితి జరుపుకునేందుకు సంబంధిత పోలీస్‌స్టేషన్లో ముందస్తు అనుమతి తప్పనిసరని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఎర్రమరెడ్డిపాళ్యంను గురువారం డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ మంజునాథ్‌రెడ్డి, ఎస్‌ఐ సుధాకర్ సందర్శించారు. చవితి ఉత్సవాలను శాంతంగా నిర్వహించేందుకు గ్రామస్తులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

## చేనేత రంగాన్ని పరిరక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని చేనేత కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ వృత్తి చేనేతను పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. చేనేత సమస్యల పరిష్కారం కోసం కార్మిక సంఘాలు, సహకార సంఘాల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా వరదయ్యపాళెం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆర్‌ఐ నల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు పృథ్వీ రవి, బుర్రా కృష్ణమూర్తి, ఇందిరానగర్ సర్పంచ్ వీరభద్రయ్య, శేఖర్, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## నేడు వరలక్ష్మీ వ్రతం

నాగలాపురం: మండల కేంద్రంలోని టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీవేదవల్లీ సమేత శ్రీవేదనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి చెంగల్‌రాయులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్రతంలో పాల్గొనే సుమంగళి స్త్రీలకు పసుపు, కుంకుమ, కంకణం పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. వ్రతం అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## దాడి: నలుగురిపై కేసు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని సీఎస్ తేజ సెంటర్ సమీపంలో ఓ చికెన్ షాపులో పనిచేస్తున్న తుమ్మూరు సంజయ్‌గాంధీ కాలనీకి చెందిన టి.వెంకటేశ్వర్లు, చిన్న రమేష్‌పై విచక్షణారహితంగా దాడి చేసిన నలుగురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వరదయ్యపాళెంకు చెందిన వంశీకృష్ణ, చైతన్య, పార్థసారథి, ఫిలిప్ ఈనెల 2న రాత్రి నాయుడుపేటకు వచ్చారు. చికెన్‌షాపు వద్ద ఉన్న వెంకటేశ్వర్లు, రమేష్‌లతో చిన్నపాటి విషయమై వివాదానికి దిగారు. ఇద్దరిపై ఆ నలుగురు పైపులతో దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.